ఆ ఆదివారం నేనెళ్ళేసరికి కమలమ్మగారు వీధిగుమ్మంలోకి వినబడేలాగ అరుస్తోంది. "చూడే, సీతా, నీ కూతురేం చేసిందోను! ఒద్దే ఒద్దే అంటూంటే కూడ డస్ట్‌బిన్నుకి ట్రే తగిలేసి ఆ చేత్తోటే వాటర్‌ట్యూబ్ తీసికెళ్లి టబ్‌లో పెట్టేసింది! పైగా బకెట్ ముంచీసింది!"

"అదేమిటే పద్మా; చెత్తకుండీ ముట్టుకున్న చేత్తోటే నీళ్లగొట్టాం పట్టుకుని కుండీలో పెట్టేడమే కాకుండా బాల్చీ ముంచీశావా?" అని సీత కూతుర్ని కోప్పడింది.

"నర్సిమ్మూర్తి లేడాండీ, పిన్నిగారూ?" అని అడిగాను.

"షేవింగ్ చేసుకుంటున్నాడు బాబూ, టెన్ మినిట్స్‌లో వచ్చేస్తాడు." అని లోపలి కెళ్లిందావిడ. నాకు నవ్వొచ్చింది. కమలమ్మగారు మంచినీళ్లగ్లాసు రెండో మనవరాలు చేత పట్టించుకొచ్చింది.

"నీ పేరేంటమ్మా?" అంటూ అందుకున్నాను.

"దీని పేరు లలిత, పెద్దదాన్లా డర్టీగా వుండదు. ఎప్పుడూ ఫ్రెష్ గా స్మార్ట్‌గా ఉంటుంది." అని కమలమ్మ గారు చెప్పగానే ఆ పిల్ల నవ్వుతూ "కడిగిన ముత్యంలా మెరిసిపోతూ వుంటానట; మా అమ్మ అంటుంది."

"ఉద్ధరించేవులే."అని కమలమ్మగారు లోపలికెళ్లింది.

"మా నాయినమ్మకి ఇంగ్లీషు పిచ్చి బాబాయిగారూ. నిన్న రాత్రి టీవీ చూస్తూ కథ విసుగ్గా ఉందని అనడానికి స్టోరీ బోరుగా వుందంది. దీపాలు పోయీసరికల్లానేమో కేండిలు వెలిగించరా అంది. రాత్రి పడుకునేటప్పుడు నా బెడ్ షీటు ఛేంజి చేసేరా - అని అడిగింది. ఇప్పుడు చూడండి కావలిస్తే; నాన్నారు గెడ్డంగీసుకుని రాగానే టిఫిన్ రెడీ అని మిమ్మల్ని "డైనింగ్ టేబిల్" దగ్గిరికి "ఇన్‌వైట్" చేస్తుంది." అని గలగలా నవ్వింది ఆ పిల్ల.

★★★

"మీ అమ్మగారు నీ దగ్గిరుంటే నీకు బరువా, నర్సిమ్మూర్తి?"

"ఛీ ఛీ అదేంమాట? మా ఆవిడకి మాత్రం మా అమ్మ మాటలిష్టం వుండవంతే".

"మీ అమ్మ మళ్లీ నాగపూరు వెళిపోతాననకుండా ఇక్కడే ఉండాలంటే మీ ఆవిణ్ణి ఇంగ్లీషు మాట్లాడేమని చెప్పు. మీ మరదలు తెలుగు మాట్లాడుంటే ఈవిడ అక్కడే ఉండేవారు. పెద్దయిపోయారు కదా. మనమే వాళ్ల మీడియంలో మాట్లాడాలి. అదే ఈ సమస్యకి పరిష్కారం." అని చెప్పేను నేను. ★

# 78. పురుష లక్షణం

**మా** ఆఖరి చిన్నాన్న గారబ్బాయి కనకయ్య నాకు వరసకి తమ్ముడే అయినా వాడు మా రెండో అబ్బాయి కన్నా రెండేళ్లు చిన్నవాడు. మొన్నీ మధ్య ఓరోజు మా చిన్నాన్న వాణ్ణి వెంట బెట్టుకుని నా దగ్గిరికొచ్చి "ఒరే గోపాలా, వీడికేదైనా ఉద్యోగం చూసిపెడుదూ! నీకు పుణ్యాం ఉంటుంది." అన్నాడు. "నీకు పెద్ద వాళ్లు బోల్డుమంది తెలుసుకదా, ఎవరితోనైనా ఒక్క మాట చెప్పేవంటే పనైపోతుంది." అన్నాడు. "నాకు పెద్ద పెద్దవాళ్లు బోల్డు మంది తెలియడమైతే తెలుసును గాని వాళ్లలో ఎవరూ కూడా నా మాట మీద ఎవరికయినా ఉద్యోగాలిస్తారని గానీ కనీసం ఒక ఊర్నించి ఇంకో ఊరికి ట్రాన్స్‌ఫర్ చేస్తారని గానీ నాకు నమ్మకంలేదు. ఐనా వీడికి దగ్గిర దగ్గిర

ముప్ఫయ్యయిదేళ్లున్నట్టుంది, ఇన్నాళ్లూ ఏ ఉద్యోగం చెయ్యకుండా ఎలా ఉండిపోయేడు!" అన్నాను.

"ఇప్పటికి ఐదు ఉద్యోగాలు చేసేనన్నయ్యా" అన్నాడు కనకయ్య.

"మరి?" అన్నాను. అయిదింట్లో ఏ ఒక్కదాంట్లోనూ కూడా ఎందుకు నిలదొక్కుకోలేక పోయావు?" అని వివరంగా అడక్కపోయినా కనకయ్య గ్రహించినట్టున్నాడు. "అది చెప్పాలంటే చాలాసేపు పడుతుంది" అని ఇటూ అటూ చూసేడు. సమయం మించి పోకుండాకుడివైపు కిటికీలో ఉన్న సుత్తిని ప్రత్యేకం వేలు పెట్టి చూపించేను.

కనకయ్యకి ముందు మొహం ఎర్ర బారింది. కాని వెంటనే వాడికి నవ్వొచ్చింది. ఈ వేపు స్టీరియో మీద లాంగ్-ప్లే రికార్డు చూపించి; వాళ్ల నాన్నవేపు చూసేడు.

"మొట్టమొదట -" అని మా చిన్నాన్న ప్రారంభించేడు. "1981లో అన్నమాట; నా క్లాస్‌మేట్ బండారు కామేశ్వరరావు దగ్గరికి తీసికెళ్లేనోరే. 81 లో తీసుకున్న జనాభాలెక్కలకి టేబ్యులేషన్ ఆఫీసరు, అప్పుడతను. మేం వెళ్ళిన వెంటనే లోపటికి రమ్మన్నాడు. అరగంట దాకా మాతో మాట్లాడకుండా బండెడు కాయితాలు సంతకాలు పెడుతూ కూచున్నాడు... "ఈ ఉద్యోగం బావుంది నాన్నా, జీతం ఎంత కొంచెమైనా ఫరవాలేదు. పొద్దుట్నించి సాయంకాలం దాకా ఇలా ఎన్నివేల సంతకాలయినా పెట్టేస్తాను..." అంటాడు వీడు. అరగంట అయ్యేక కామేశ్వర్రావు లేచి, "రండి, నాతో" అన్నాడు. వెళ్ళేం. ఆ ఆఫీసులో పదమూడు సెక్షన్లు ఉన్నాయి. అవన్నీ తిరుగుతూ, పక్కని మేం ఉన్నాం అన్న ఇది కూడా లేకుండా-ఒక్కొక్క సెక్షను వాళ్లనీ ఒక్కొక్క లా, తిట్టిన తిట్టు తిట్టకుండా బండ బూతులు తిట్టేడు. వాళ్ళెవరూ ఏమీ అనుకోలేదు గానీ నీ తమ్ముడు బెంగెట్టేసుకున్నాడు. "అయ్యబాబోయి. ఉద్యోగం లేపోతే పీడాపోయింది గాని ఇన్ని తిట్లు నేను తిట్టలేను నాన్నోయి." అన్నాడు. "ఆ పదమూడు సెక్షన్లలో దేంట్లోనో ఓ దాంట్లో నిన్ను వేస్తారు. తిట్లన్నీ అతనే తిడతాడు. నీకేం సంబంధం లేదు" అని నచ్చజెప్పేక మర్నాడెళ్ళి జాయినయ్యేడు. కాని నాలుగు రోజులైనా అక్కడ చెయ్యలేదు."

"అదేం?"

"సంతకాలూ లేవు, తిట్లూ తిట్టక్కర్లేదు. కాని ఛీఫ్ సూపరెంటు, డిప్యూటీ చీఫ్ సూపరెంటు, మేనేజరు ఎవరొచ్చినా సరే స్టాఫ్ కూర్చోడానికి కట్టిన ఆ ఇటిక దిమ్మలమీంచి లేవడం, నమస్కారం పెట్టడం: ఇవన్నీ ఎవడు చేస్తాడన్నయ్యా? నా కసలే ఓపిక లేదు." అన్నాడు కనకయ్య. నాకు సంకు పాపారావుగారి జోకు గుర్తొచ్చింది. ఓ సారి ఏదో హోటల్ రూంలో నలుగురూ "కూచుని" కాలక్షేపం చేస్తూ వుంటే సడెన్‌గా రావిశాస్త్రి గారక్కడికొచ్చేరు. "గురువు గారికి దిండు వెయ్యండి, పాపారావుగారూ!" అన్నారట ఒకరు. "ఇది గిలాటి పన్లన్నీ యవరికైనా జెప్పుగానీ నాకు జెప్పక! నా కసలు ఇటు గ్లాసటు పెట్టడానికే బద్ధకం" అన్నారట పాపారావు గారు.

నవ్వుకున్నాను.

"ఆ తరువాత పోస్టాఫీసులో స్టాంపులమ్మే ఉద్యోగం వొచ్చింది.కార్డు కావలసిన వాళ్లు పదిహేను పైసలు, ఇన్‌లాండు కవరుకి నలభై పైసలూ ఇలాగ చిల్లర పట్టుకొస్తేనే అమ్మకం. రూపాయి నోటుకాదు, ఆఖరికి రూపాయి నాణెం చూపించినా సరే; కుర్చీలో వెనక్కి చేరబడిపోయి "చిల్లర్లేద్" అని చెప్పేడమే."

"మరి ఆ ఉద్యోగం ఎందుకు పోయింది?"

"జీతం నామ్‌కే వాస్తే కొద్దిగా ఇచ్చి అమ్మకాల మీద పర్సంటేజి ఇచ్చే ఒప్పందం. హెడ్ పోస్టాఫీసులో కూడా వీడి సీట్లో నెలకి నూరు రూపాయల అమ్మకం లేకపోయే సరికి వాళ్లే పొమ్మన్నారు." అన్నాడు మా చిన్నాన్నగారు. "ఆ తరువాతొచ్చింది బస్ స్టేషన్లో ఎంక్వయిరీ కౌంటర్లో కూచునే ఉద్యోగం" అన్నాడు కనకయ్య.

"అది కాదనుకుంటా(న్రా, అంతకి ముందు రైలు స్టేషన్‌లో ప్లాట్‌ఫారం టికెట్లమ్మే ఉద్యోగం ఒకటొచ్చింది కదా!" అన్నాడు మా చిన్నాన్నగారు. "అక్కడ కొన్నాళ్లు బాగానే చేసేడు. వర్క్ హెవీగా ఉంది. అసలే అది బెజవాడ స్టేషన్ కదా. ఇరవై నాలుగ్గంటలూ ట్రాఫిక్కే, అందులోనూ మన కల్చర్ ఎలాంటిదీ అంటేనూ; రైలు కెళ్లేవాడు ఒక్కడే అయినా సెండాఫ్ లిచ్చేవాళ్లు అయిదేసి మంది తేల్తారు. ఒక్కొక్క రైల్లో బెజవాడలో ఎక్కేవాళ్లు 200 మంది అనుకుంటే 1000 ప్లాట్‌ఫారం టిక్కెట్లు అమ్మాలి. వీడు డ్యూటీలో ఉండే ఎనిమిది గంటల్లోనూ 20 ట్రెయిన్లయితే మొత్తం ఇరవై వేలప్లాట్‌ఫారం టిక్కెట్లు అమ్మవలసొచ్చేది. డ్యూటీ దిగిపోయేటప్పుడు అప్పజెప్పవలసిన డబ్బు 30,000 రూపాయలు! కష్టమా కాదా, నువ్వే చెప్పు!"

నేనేం చెప్పకుండానే కనకయ్య అందుకున్నాడు. "నేనా, అలాగ లొంగేది? నాలుగు నెలలు చేసేక అసలు దీనికో రూలూ రైమూ ఉందా అని బద్ధకించకుండా పరిశోధన చేసేను. చివరికి రైల్వే గైడులోనే దొరికింది ఆన్సరు. ఏ బండిసమయంలో అయినా సరే నూరు ప్లాట్‌ఫారం టిక్కెట్లు మాత్రం అమ్మి; ఆ తరువాత లేవు పొమ్మనడం మొదలుపెట్టేను. మీరు ఏమంటే అనండి గాని అన్నయ్యా; ఆ ఉద్యోగంలోంచి నన్ను తీసేడం అన్యాయం!"

"తీసేశారా? ఎందుకట?"

"ఎవడో కంప్లెంటిచ్చేడు. స్టేషన్ సూపరింటు ఎన్‌క్వయిరీ కొచ్చేడు. రైల్వే గైడు తీసి రూల్ చూపెట్టి లెఫ్ట్ ఎండ్ రైట్ ఇచ్చేను."

"యీమనుంది, రూల్లో?"

"సక్రమమైన టిక్కెట్టుగల ప్రయాణీకులు తప్ప ఏ ఇతర వ్యక్తులుగాని ప్లాట్‌ఫారం టిక్కెట్ కొనకుండా ప్లాట్ ఫారం మీదికి ప్రవేశించకూడదు. ఈ ప్లాట్‌ఫారం టిక్కెట్లనేవి కూడా ప్లాట్‌ఫారం యొక్క కెపాసిటీని మించి అమ్మకూడదు - ఇందులో రెండు పాయింట్లున్నాయి-సెండాఫ్ లిచ్చే వాళ్లకీ, రిసీవ్ చేసుకొనే వాళ్లకీ అడిగిన వాళ్లకల్లా ప్లాట్‌ఫారం టిక్కెట్లు అమ్మకూడదు. 'ప్రయాణీకులు తప్ప' అన్న దాంట్లో స్టేషన్ సూపరింటు నుంచి కళాసీల దాకా అందరూ ఉన్నారు. వీళ్ళెవ్వరూ ప్లాట్‌ఫారం టిక్కెట్లు కొనరు, అసలు!" కనకయ్య ఎంత హీటెక్కి పోయేడంటేనూ, నా టేబిలు మీదున్న సరికొత్త గైడు తెరిచి 118వ పేజీ చూపించి "చూడండి" అన్నాడు.

★★★

మొన్న శనివారం రాత్రి 7-25 ప్రాంతంలో మా కనకయ్య టీవీ తెరమీద కనిపించేడు. "రేపటి ప్రసారాలు" అని ఎనౌన్సు చేస్తూ. గొప్ప ఛాన్స్ కొట్టేడే అని సరదా వేసింది. "ఉదయం ఏడు గంటలకి - ఢిల్లీ నుండి ఉదయం కార్యక్రమాలు. ఒంటి గంటా పదిహేను నిమిషాలకి బధిరులకి వార్తలు. ఒకటిన్నరకి ప్రాంతీయ భాషా చలనచిత్రం. మధ్యాహ్నం రెండు గంటలకి హిందీలో

వార్తలు, మూడు గంటలకి ఆంగ్లంలో వార్తలు, సాయంకాలం ఐదున్నరకి తెలుగు చలనచిత్రం "చేటలో బియ్యం-బాటలో రాళ్లు." ఏడున్నరకి తెలుగులో వార్తలు. ఏడు గంటల నలభై అయిదు నిమిషాలకి ఉరుదూలో వార్తలు. ఏడూయాభైకి తెలుగు చలనచిత్రం తరువాయి **భాగం**. ఎనిమిది గంటల నలభై నిముషాల నుండి జాతీయ కార్యక్రమాలు."

"మధ్యాహ్నం రెండు గంటల వేళప్పుడు టెలిప్రింటర్‌మీద వివరంగా మర్నాడు ఫలానా వేళకి ఫలానా కార్యక్రమాలంటూ అన్ని వివరాలతో ఛార్ట్ వస్తుంది. చూసి చెప్పొచ్చు" అని నేను కనకయ్యకి చెప్పలేదు. ఆ పెంట పని అంతా ఎవడు చేస్తాడని ఎవరితోనో తగూ పెట్టుకుంటే వాడికి ఈ ఉద్యోగం కూడా పోతుంది. ★

# 79. వర్గవిభేద పరిష్కారం

**ఆ**మధ్య ఏదో పనిమీద రాజమండ్రి వెళితేనూ; నా మిత్రుడు చిరంజీవిరావు, తన మిత్రులు కొందరు ఆ వేళకి అక్కడ కూచుని వుంటే వాళ్లకి నన్ను పరిచయం చేసే కార్యక్రమం చేపట్టాడు.

"ఇతను మా క్లాస్మేటు. మీరతని పేరు వినే వుంటారు; "రైటరు" అన్నాడు ఒకాయనతో.

"టూటౌనాండీ?" అన్నాడాయన.

నేనేమీ జవాబు చెప్పలేని పరిస్థితి!

"అదేనండీ. వన్ టౌన్ పోలీసు స్టేషన్ రైటరు సుబ్బారావు మా తోడల్లుడండి. అంచేత తమరు టూ టౌన్ రైటరేమో అనుకున్నానండి." అన్నాడతనే; రెండు క్షణాలు ఊరుకొని.

మా చిరంజీవిరావు "రైటర్" అనే పదానికున్న ఇతర అర్థాలు చెప్పి అతన్ని శాంతపరచి; ఇంకో ఆయనతో "మీకులాగే ఇతనికి స్టాంపు కలెక్షను హాబీ అండీ". అని చెప్పేడు.

ఆయన నొసలు ముడిచి "స్టాంపు కలెక్షనేమిటండీ బాబూ, ఫిలేటెలీ అన్లేరు?" అన్నాడు.

మా చిరంజీవి రావు పల్లెటూరి బైతు తనాన్ని క్షమించి ఆ "ఈవినింగు సెవెన్ తర్టీకి" మనం అంతా వో దగ్గిర "కూర్చోవాలి" అని నిర్ణయం తీసుకున్నారు అతని మిత్రులు. "నరసప్పగారు లేకపోతే మజా వుండదు. అతన్నెలాగయినా లాక్కురావాలి." అన్నాడు చిరంజీవి.

"ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ హిం" (అతని సంగతి నేను చూసుకుంటానులెండి) అని వన్ టౌన్ "రచయిత" గారి షడ్డకుడు హామీ ఇచ్చేడు.

నరసప్పగారు మా "గేదరింగు" లో కొంచెం "లేటు" గా "జాయినయ్యేడు." అంచేత రావడం రావడమే "ఎపాలజీస్" తో మొదలెట్టేడు.

ఆరోజు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్‌లో నరసప్పగారి డిపార్టుమెంటులో అతన్ని తవ్వి పాతెయ్యగల పవర్సున్న ఆఫీసర్ హైదరాబాదు నుండి కాకినాడ వెడుతున్నారనీ, వార్ని రాజమండ్రి స్టేషన్‌లో "ఎటెండ్" అవమనీ మెసేజి వచ్చిందిట.

"ఈస్టుకోస్టు సాయంకాలం 4-45 కే వెళిపోవాలి కదా?"

"మామూలుగా అయితే అంతే. ఇవాళ రెండువందల నిముషాలు లేటు."

అందరూ నవ్వేరు.

"ఆగండి. ఎందుకు నవ్వుతారు? నవ్వవలిసింది ఇప్పుడు కాదు. ఇంకా ముందుంది అసలు